# సంపాదకీయము

భగవంతుని సంకల్పముచే ప్రపంచ సృష్టి ఉద్భవించింది. కనుక సృష్టిలోని ప్రతిదీ దివ్యత్వముతో కూడియున్నది. సృష్టిలోని జీవరాశులన్నింటిలోను మానవుడు ఉత్కృష్టముగా తీర్చిదిద్దబడ్డాడు. భగవంతుడు మనకు ప్రసాదించిన మానవ జీవితం ఒక గొప్ప వరము. భగవంతుడు మానవునకు మనస్సును ప్రసాదించి మహోపకారము చేసాడు. మానవుడు తన మనస్సును సరిగా వినియోగించుకొని నిజ జీవిత లక్ష్య మైన శాశ్వత సత్వప్రాప్తిని పొంది భగవంతుడు మానవునకు ఇచ్చిన సదవకాశమును సద్వినియోగము చేసుకొనవలెను. అప్పుడే మానవజన్మ సార్థకమవుతుంది.

మానవుని విజ్ఞాన వికాస ఫలితంగా శాస్త్ర సాంకేతిక రంగం అద్భుతమైన పురోగతిని సాధించి ప్రపంచములోని దేశములన్నీ దగ్గరవుతున్నట్లు కనబడుతుంది. ఆధునిక సమాచార ప్రగతి మూలంగా, ప్రజల అవసరాల దృష్ట్యా వివిధ దేశములు పరస్పర అవగాహనకు వస్తున్నట్లు కనబడుతుంది. కాని పాశ్చాత్య నాగరికతా ప్రభావముతో ప్రపంచములోని ప్రజలందరు ఆధునికత, భౌతికాభివృద్ధిలో మునిగిపోయి పూర్తిగా భౌతిక వాదంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఆధునిక నాగరికతా ప్రభావంతో ప్రజల మనస్సులు అల్లకల్లోలమై, ఇంద్రియములు వశము తప్పి అసూయ, దురాశ, ద్వేష భావములు, పోటీ తత్వములు, క్రమశిక్షణా రాహిత్యము పెంపొంది అశాంతికి గురియగుచున్నారు. కనుక ప్రజల మనస్సులను సరియైన విధంగా క్రమబద్ధం గావించాలి. అందుకు సరియైన ఆధ్యాత్మిక పద్ధతిని అనుసరించుటయే పరిష్కార మార్గము. ఆధ్యాత్మికంగా ఉన్నతి పొందిన వారు మాత్రమే శాంతితో జీవించగలరు.

మన గురుదేవులు పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్ (పూజ్య బాబూజీ మహారాజ్) ప్రపంచ ప్రజలందరి సమస్య పరిష్కారానికి సులభ ఆధ్యాత్మిక మార్గ మైన ప్రాణాహుతి సహిత ధ్యానమును ప్రసాదించారు. ఈ పద్ధతిలో ప్రాణాహుతి అనునది అత్యంత విశిష్టమైన అంశము. ప్రాణాహుతి శక్తి అత్యుత్తమమైన యోగ సిద్ధి. సమర్థుడైన శిక్షకుడు ప్రాణాహుతి యోగశక్తి ద్వారా దివ్యకృపను సాధకునిలో ప్రవేశపెట్టి ఆధ్యాత్మికోన్నతికి అతనిలోని ఏ విధమైన అడ్డంకులనైనను లేదా అనవసరమైన వాటిని తొలగించగలడు. తత్ఫలితముగా మనస్సు క్రమబద్ధీకరించబడి

మానవునిలో సమూలముగా మార్పు వచ్చి శాంతి, సంతృప్తి స్థితులను పొందగలడు. కనుక ప్రపంచములోని ప్రజలందరు మన గురుదేవులు ప్రసాదించిన ప్రాణాహుతి సహిత ధ్యానమును ఆచరించుట వలన వ్యక్తిగతంగా శాంతిని పొందుటయే గాక ప్రపంచ శాంతికి దోహదపడగలరు.

మనందరము ఒకే మూలమునుండి వచ్చామన్న విషయాన్ని మనము గ్రహించినప్పుడు మన మధ్య భేదము లేదని తెలుసుకుంటాము. మన హృదయాలలో భగవంతుడు వున్నాడని గ్రహిస్తే మనందరి మధ్య ఏకత్వముందని తెలుసుకొన్నప్పుడు మనందరము ఒకరిపట్ల ఒకరు సంపూర్ణ గౌరవ భావముతో సమైక్య జీవన విధానమునకు అలవాటు పడతాము. ఈ సాధనను ఆచరించుటవలన ఆధునిక ప్రపంచములోనున్న అధర్మ పద్ధతులన్నియు అంతరించి ప్రజలను సమైక్యపరచి వసుధైక కుటుంబముగా ఏర్పడుటకు సాధ్యపడుతుంది.

ఈ సాధనను ఆచరించుట వలన మన సంస్కారములు పూర్తిగా క్షాళన గావించి, పరహితము, పరస్పర సహకారము, ఐకమత్యము, త్యాగము, సేవా తత్పరత మొదలగు దివ్య లక్షణములు పెంపొంది మన పరిణామమును అతి తక్కువ కాలంలోనే సాధ్యమయ్యేటట్లు గావించి ఈ జీవిత కాలమందే మన నిజజీవిత లక్ష్య మైన శాశ్వత సత్యప్రాప్తిని పొందవచ్చును. ఇట్లు మన గురుదేవులు పూజ్య బాబూజీ మహారాజ్ ప్రాణాహుతి సహిత ధ్యానమును ప్రపంచ మానవాళికి ప్రసాదించి మానవ పరిణామమును సులభ సాధ్యము చేసిన మహాత్ముడు. అటువంటి మహాత్ముడు మన గురుదేవులు పూజ్య బాబూజీ మహారాజ్ గారి 104వ జన్మదినోత్సవమును ఏప్రిల్ 30న మనము జరుపుకుంటున్నాము. ఆయన జన్మదినము సర్వ మానవాళికి పర్వదినము, శుభ దినము.

కనుక మనందరము మన గురుదేవులు పూజ్య బాబూజీ మహారాజ్ ప్రసాదించిన ప్రాణాహుతి సహిత ధ్యానమును ఆచరించి ఈ జీవితకాలమందే మన నిజ జీవిత లక్ష్య మైన శాశ్వత సత్యప్రాప్తిని సాధించి మానవ పరిణామమునకు మన కర్తవ్యమును సక్రమముగా నిర్వ ర్తించి భగవంతుడు ప్రసాదించిన మానవ జన్మను సార్థకము చేసుకొందాము.

**టి.ఆంజనేయులు**